# సారీ సర్!

జీవితంలోంచి కథ వస్తుంది. కథా రచయితల వర్క్‌షాప్ లాంటి వారపత్రికలో నేను సంపాదకునిగా పనిచేస్తున్నాను.

ఫోన్ మోగింది.

"హలో"

"నేను విజయనండీ. నా కథల సంపుటి ఆవిష్కరణకు మీరు కాకినాడ రావాలి".

"అలాగే—"

"మీరు స్టేషన్‌లో రైలు దిగివుండండి—నేను కారు పంపిస్తాను".

"మరి నన్ను ఎవరూ చూడలేదు కదా. ఎలా గుర్తిస్తారు?"

"మీరు చేతిలో నా పుస్తకం పట్టుకుని రైలు దిగండి. వెరీ సింపుల్".

"థాంక్యూ" ఫోన్ పెట్టేసిందామె.

ఆమె కాకినాడలో ప్రముఖ రచయిత్రి. మా పత్రికలో చాలా కథలు వేశాను.

ఆ రోజు సికింద్రాబాద్‌లో గౌతమి ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. కొంచెం సేపు ఆమె కథల సంపుటి చదువుతూ ఆలోచిస్తూ నిద్రపోయాను.

కాకినాడ వచ్చింది.

రైలు దిగేను. నాకోసం ఎవరూ రాలేదేమిటి అనుకుంటున్నాను.

ఈలోగా....

నాకు ముందు నడుస్తున్న ఒక మధ్యవయస్కుని "అదేమిటి సార్

మీరు కాదంటారు. మరి విజయగారి పుస్తకం మీకెలా వచ్చింది? పోనీ కారులో ఇష్టం లేకపోతే రిక్షాలో రండి'' అంటున్నారు ఇద్దరు యువకులు.

''నాకేం తెలియదయ్యా బాబూ. మాది ఈ ఊరే. రైల్లో దొరికింది ఈ పుస్తకం'' అంటున్నాడాయన.

నేను అటు చూశాను.

అతని చేతిలో విజయగారి కథల పుస్తకం.

నేను వాళ్ళ దగ్గరికి వెళ్ళాను.

''ఎక్స్క్యూజ్ మి. నేను.......'' అన్నాను.

''సారీ సర్'' అంటూ నన్ను వాళ్ళు తెచ్చిన కారు వేపు తీసుకువెళ్ళుతున్నారు, నేను కథల పుస్తకం చదువుతూ రైల్లో కునికిపాట్లు పడుతున్నప్పుడు కథల పుస్తకం జారిపోయి వుంటుందన్న విషయం, నా చేతిలో పుస్తకం వుంచుకోవాలన్న విషయం మర్చిపోయిన వైనం వాళ్ళకి చెప్తున్నాను. వాళ్ళు నవ్వుకుంటున్నారు.

—0—

# అదే పదివేలు

సాహితీ రంగంలో ఒక స్థాయికి వచ్చేవరకూ కష్టపడాలి. తరువాత ఎలా వ్రాసినా ఎలా చేసినా చెల్లుబడి అవుతుంది. బండి స్టార్ట్ కాకపోతే తోసేక ఆ బండి స్టార్టయ్యి నిరాటంకంగా కొనసాగినట్లే....

నేను కథ రచయితగా పత్రికారంగంలో స్థిరపడ్డాను. పైగా విశేషమేమంటే నేను ఇంతవరకు వ్రాసిన దాదాపు అన్ని కథలకు బహుమతులు రావడమే. అందునా అన్నీ ప్రథమ బహుమతులే. ఈ సంద